
ప్రజాశక్తి
గురువారం 14 డిసెంబర్ 2023 5 అనంతపురం





అనంతపురం కలెక్టరేట్ వద్ద నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీలు



మడకశిర మండలం బుల్లసముద్రం గ్రామంలో పంట పొలాలను పరిశీలిస్తున్న కరువు బృందం సభ్యులు

నష్టంపై రైతుల ఏ'కరువు'..!

- అన్ని పంటలనూ నష్టపోయాం.. ఆదుకోండి
- కేంద్ర బృందం ఎదుట రైతుల ఆవేదన
- 2వ రోజు శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటన
- ముగిసిన కేంద్ర కరువు బృందం పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'ఈ ఏడాది తీవ్రమైన కరువుతో పంటలను మొత్తం కోల్పోయాం. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదు. గడిచిన మూడేళ్లుగా పంటల కోసం చేసిన అప్పులనే తీర్చలేదు. ఇప్పుడు మళ్లీ ఈ ఏడాది పంటల అప్పులు పెరిగాయి. పంటలకు పెట్టిన పెట్టుబడి నయాపైసా కూడా చేతికిరాలేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే తమను ఆదుకోవాలి. లేకుంటే మరింత సంక్షోభంలో కూరుకుపోతాం.' అంటూ రైతులు కేంద్ర కరువు బృందం ఎదుట సమస్యలను ఏ'కరువు' పెట్టారు. అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో రెండు రోజుల పాటు పర్యటించాయి. భారత వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి పంకజ్ యాదవ్ నేతృత్వంలో పది మంది సభ్యులతో వచ్చిన కేంద్ర బృందం మంగళవారం, బుధవారం పర్యటించారు. మొదటి రోజున మంగళవారం నాడు అనంతపురం జిల్లాలో మూడు బృందాలుగా విడిపోయి అనంతపురం, ఆత్మకూరు, కల్యాణదుర్గం, గుమ్మగట్ట, గుత్తి, పామిడి మండలాల్లో పర్యటించాయి. అంతక మునుపు జిల్లా కలెక్టరు కార్యాలయంలో జిల్లాలో నెలకొన్న వాతవరణ పరిస్థితులు, పంటనష్టం, వివరాలతోపాటు, ఎంత మేరకు సహాయం అవసరమవుతుందన్న నివేదికలను జిల్లా అధికారుల నుంచి స్వీకరించారు. అనంతరం క్షేత్ర స్థాయి పర్యటన జరిపారు. అయితే మొదటి రోజు పర్యటన మొత్తం ఆలస్యంగ సాగింది. దీంతో రైతులు పూర్తి స్థాయిలో తమ సమస్యలు చెప్పుకోవడానికి వీల్లేకుండాపోయింది.

రెండో రోజు పర్యటన ఇలా సాగింది :

సత్యసాయి జిల్లాలో ఒక బృందమే పర్యటించింది. పరిగి, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో పర్యటించింది. పరిగి మండలంలోని మోద గ్రామంలో మొదట పర్యటించింది. అక్కడ రైతులతో ముఖాముఖి అయ్యారు. అదే విధంగా అశ్వర్థమ్మ అనే మొక్కజొన్న రైతు పొలంలోకెళ్లి ఎండిన పంటను పరిశీలించారు. మూడు ఎకరాల్లో రూ.75 వేలు పెట్టుబడి పెట్టి పంట సాగుచేస్తే వర్షాలు లేక పండిపోయిందని ఆమె కరువు బృందం ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఇదే సందర్భంలో మరికొంత మంది రైతులు తమను ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నారు. మాజీ మంత్రి, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొన్నారు. పంటనష్టానికి పరిహారంతోపాటు, నిత్యం కరువు ప్రాంతమైన ఈ ప్రాంతానికి శాశ్వత పరిష్కారానికి నిధులు కేటాయించే విధంగా కేంద్రానికి సిఫారసు చేయాలని కోరారు. అనంతరం అదే మండలంలోని పుట్లగుర్లపల్లిలో కందిపంటను పరిశీలించారు. అటు తరువాత మడకశిర మండలంలోని బుల్లసముద్రం గ్రామంలో లక్ష్మీదేవికి చెందిన కందిపంటను పరిశీలించారు. వర్షాభావంతో కందిపంట కూడా చేతికొచ్చే పరిస్థితుల్లేవని తెలిపింది. గుడిబండ మండలంలోని జంబులబండ గ్రామంలో బాలకృష్ణప్ప పొలంలో ఎండిన కందిపంటను పరిశీలించారు. అమరాపురం మండలంలోని వలస గ్రామంలోనే పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టానికి సంబందించి రూ.63.29 కోట్లు నిధులు అవసరమవుతాయని జిల్లా జాయింట్ కలెక్టరు చేతన్ కేంద్ర కరువు బృందానికి వివరించారు. బుధవారంతో అనంతపురం, సత్యసాయి జిల్లాల పర్యటన ముగిసింది. గురువారం నాడు చిత్తూరు జిల్లాలో కేంద్ర కరువు బృందం పర్యటించనుంది.

రెండు జిల్లాలకు అడిగిన సహాయం ఇది

అనంతపురం జిల్లాకు రూ.329.82 కోట్లు నిధులు వ్యవసాయం, తాగునీరు, ఉపాధి హామీ అన్నింటికీ కలిపి నిధులు అవసరమవుతాయని ప్రతిపాదించారు. ఇక సత్యసాయి జిల్లాకు సంబంధించి మొత్తం కలిపి 63.29 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదించారు. ఇందులో కేంద్రం నుంచి ఏ మేరకు సహాయం అందుతుందన్నది చూడాల్సి ఉంది.

పోలీసుల చొరవ.. రోడ్డు సమస్యకు పరిష్కారం.!

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న రహదారి మరమ్మతుపై పోలీసులు దృష్టి సారించారు. పైపు లీకేజీతో రహదారిపై నీరు నిల్వడం వల్ల తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతంలో జేసిబి ద్వారా ఆ నీటిని మళ్లించి రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టారు. పైప్‌లైన్ లీకేజీ అయ్యి నీరు రోడ్డుపై పారుతుండడంతో కూడేరు మండలం జల్లిపల్లి సమీపంలోని అనంతపురం- ఉరవకొండ రహదారిపై తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండేవి. ఈ సమస్యపై దృష్టి సారించిన కూడేరు ఎస్ఐ సత్యనారాయణ బుధవారం ఉదయం జెసిబి ద్వారా ఆ నీటిని రహదారిపైకి రాకుండా పక్కకు మళ్లించారు. సమస్యను పరిష్కారానికి చర్యలు తీసుకున్న కూడేరు ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బందిని ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ అభినందించారు.

అధ్యాపకులు సమాజ మార్గదర్శకులు

జెఎన్‌టియు విసి రంగ జనార్ధన



అధ్యాపకున్ని సన్మానించి, జ్ఞాపికను అందిస్తున్న విసి రంగజనార్ధన

ప్రజాశక్తి-అనంతపురం

అధ్యాపకులు సమాజ నిర్మాణానికి మూల స్తంభాలని అనంతపురం జెఎన్‌టియు ఉపకులపతి ఆచార్య రంగ జనార్ధన తెలిపారు. బుధవారం నాడు అనంతరం జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో జెఎన్‌టియు యూనివర్సిటీ స్థాయి అధ్యాపకులకు అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని రిజిస్ట్రార్ సి.శశిధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనివర్సిటీ కళాశాలలు, ప్రయివేటు కళాశాలల్లో ఉత్తమ అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు, వర్సిటీ ఉమెన్ ఎంపవర్మెంట్ ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్, వాలంటీర్స్, రాష్ట్ర ప్రభుత్వ బెస్ట్ టీచర్స్, పేటెంట్స్, యూనివర్సిటీ అవార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో అధ్యాపకులు పాత్ర ఎంతోకీలకం అయినదన్నారు. అధ్యాపకులు వారి దగ్గరున్న సమాచారాన్ని వర్శిటీకి అందించాలని కోరారు. ఈ సమాచారం ఎన్ఐఆర్ఫ్ ర్యాంకింగ్, న్యాక్‌కు ఉపయోగపడుతుందని తెలిపారు. దీని వల్ల మెరుగైన గ్రేడింగ్ సాధించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. అనంతరం అవార్డు గ్రహీతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వి.సత్యనారాయణ , వైస్‌ప్రిన్సిపాల్, యూనివర్సిటీ డైరెక్టర్లు, కళాశాల విభాగాల అధిపతులు లు, అధ్యాపకులు, భోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఉధృతం అవుతోంది. 2వ రోజు బుధవారం నాడు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ అంగన్‌వాడీ టీచర్లు, మినీటీచర్లు, ఆయాలు నిరసన దీక్షల్లో పాల్గొన్నారు. చట్టిబిడ్డలను ఎత్తుకుని దీక్షల్లో పాల్గొన్నారు. ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరాల్లోనే కూర్చొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే 'అంగన్‌వాడీ అక్కాచెల్లెమ్మల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి గారూ... మాఆవేదను పట్టించుకోండి'.. అంటూ వేడుకున్నారు. అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు అన్ని పార్టీలు, ప్రజాసంఘాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోంది. సిపిఎం నాయకులు అంగన్‌వాడీల దీక్షల్లో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. సిపిఎంతో పాటు టిడిపి, జనసేన పార్టీలు సైతం అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు. పాదయాత్ర సందర్భంగా తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు ఇస్తామనే హామీతో పాటు ఇతర సమస్యలపై ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి స్పందించేంత వరకు సమ్మెను విరమించేది లేదంటూ అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ప్రభుత్వం సమస్యను పరిష్కరించాల్సింది పోయి సమ్మె చేస్తున్న వారిపై అధికారులతో బెదిరింపులకు దిగుతోందని, ఇలాంటి వాటికి బెదిరేది లేదన్నారు.



లేపాక్షి మండల కేంద్రంలో నిర్వహించిన సమ్మె నిరసన కార్యక్రమంలో చంటి బిడ్డతో సహా పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్త

అంగన్‌వాడీల ఆగ్రహం

- 2వ రోజు కొనసాగిన సమ్మె
- చంటిబిడ్డలతో పాటు నిరసనలో పాల్గొన్న అంగన్‌వాడీలు
- పార్టీలు, ప్రజల నుంచి పెరుగుతున్న మద్దతు

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీల సమ్మె కొనసాగుతోంది. 5126 అంగన్ వాడీ కేంద్రాల పరిధిలో అంగన్‌వాడీలు ఆందోళనబాటపట్టారు. పాదయాత్ర సందర్భంగా వేతనాలు పెంపు, ఇతర సమస్యలపై జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సమ్మెలో భాగంగా మొదటి రోజు మంగళవారం నాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయాల ముందు టెంట్‌లు వేసుకుని ఆందోళన చేపట్టారు. రెండవ రోజు బుధవారం నాడు తహశీల్దార్ కార్యాలయాల వద్ద సమ్మె కొనసాగించారు.



నార్పలలో అంగన్ వాడీలు చేపట్టిన నిరసనలో అమ్మకు తోడుగా దీక్షలో కూర్చొన్న చిన్నారి

తెలంగాణలో కంటే కనీసం రూ.వెయ్యి అదనంగా వేతనం ఇస్తాని అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీంతో పాటు గ్రాడ్యూటీతో పాటు దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేస్తున్నారు. అంగన్ వాడీ కార్మికులు సమ్మెలోకి వెళ్లడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాలు మూతపడ్డాయి. అనంతపురం జిల్లా వ్యాప్తంగా 11 ప్రాజెక్టుల పరదిలో 30 మండలాల్లో 2301, శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 12 ప్రాజెక్టుల పరిధిలో 33 మండలాల్లో మెయిన్ సెంటర్‌లు 2198, మినీ సెంటర్‌లు 627 మొత్తం 2825 అంగన్ వాడి కేంద్రాలు మూతబడ్డాయి.

వార్తలు 6లో

యాప్‌ల భారం తగ్గించాలి



అంగన్‌వాడీ వర్కర్లకు ఎఫ్ఆర్ఎస్ వంటి యాప్స్ తీసుకొచ్చారు. దీని వల్ల తీవ్ర పనిభారం పెరిగింది. తక్షణం ఈ యాప్‌ల భారం తగ్గించాలి. సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదు. పని భారం పెంచారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్ ఫోన్లకు నెట్ రాదు. కార్యాలయాల అవసరాలకు సొంత ఫోన్లు వాడుతున్నాం. లోడ్ పెరగి అవి కూడా మొరాయిస్తున్నాయి. బిల్లులు సక్రంగా రాకపోవడంతో బయట వడ్డీలకు డబ్బులు తీసుకొచ్చి సెంటర్‌ల నిర్వహణ చేయాల్సిన దుస్థితి ఉంది. ప్రభుత్వం అంగన్ వాడీల సమస్యలను పరిష్కరించాలి.

లావణ్య, అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి.

వేతనం పెంచి, సమస్యలు పరిష్కరించాలి



చాలీచాలని వేతనాలతో అంగన్ వాడీ కార్యకర్తలుగా పని చేస్తున్నాం. పని ఎక్కువ వేతనం తక్కువగా తమ జీవితాలు సాగుతున్నాయి. సెంటర్ నిర్వహణతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. సీఎం ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలి. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి. రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాట్యుటీ అమలు చేసి, పని భారాన్ని తగ్గించాలి.

శిరిషా, యూనియన్ ప్రాజెక్టు నాయకురాలు.

ప్రధాన డిమాండ్లు...

- అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి.
- సుప్రీంకోర్టు చెప్పిన మేరకు గ్రాట్యూటీపై అమలు చేయాలి.
- మినీ సెంటర్లను ప్రధాన కేంద్రాలుగా మార్చాలి.
- రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.5లక్షలకు పెంచాలి. పెన్షన్ ఇవ్వాలి.
- మెనూ ఛార్జీలు పెంచాలి.
- పెండింగ్‌లో ఉన్న బిల్లులు, సెంటర్ల అద్దెలను వెంటనే విడుదల చేయాలి.
- కేంద్రాలకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలి.
- అంగన్‌వాడీలపై రాజకీయ జోక్యాన్ని నివారించాలి.
- యాప్‌ల వేధింపులను నివారించాలి.

సెలవులో అనంత కమిషనర్



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భాగ్యలక్ష్మి నెలరోజుల పాటు సెలవుపై వెళ్లనున్నారు. ఈ మేరకు మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ కోటేశ్వరరావు నుంచి అనుమతి లభించినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, ఇతర విభాగాల్లోని అధికారులు పని ఒత్తిళ్లు, కమిషనర్ ఒంటెద్దు పోకడలు భరించలేక దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. దీనికి తోడు కార్పొరేషన్‌లో వివిధ విభాగాల్లో అవినీతి స్వైర విహారం చేస్తున్నట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. అవినీతిని నియంత్రించాల్సిన కార్పొరేషన్ ఉన్నతాధికారులు ఆదిశగా చర్యలు తీసుకోలేదని విమర్శలు ఉన్నాయి.

కార్పొరేషన్‌లో కొనసాగుతున్న సెలవుల పరంపర

అవినీతికి ఊతమిచ్చేలా అధికారి వ్యవహరించారనే వాదన ఉంది. టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీలు బాలాజీ, చంద్రమోహన్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. రెగ్యులర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్ సైతం అనారోగ్య కారణాలతో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. కార్పొరేషన్‌లో ఏ విభాగంలో జరిగే పని అయినా కమిషనర్‌కు తెలియకుండా జరగదని అక్కడి అధికారులు చెబుతుంటారు. ఏదైనా అవినీతి విషయంలో మాత్రం దిగువ స్థాయి అధికారులను బలి పశువులుగా మారుస్తారనే అభిప్రాయం అధికార వర్గాల్లో నెలకొంది. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ అవినీతిపై పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నాయి. దీనిపై కూడా కనీసం వివరణ ఇవ్వలేని పరిస్థితిలో కార్పొరేషన్ ముఖ్య అధికారులు ఉండడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లో కమిషనర్ భాగ్యలక్ష్మి గురువారం నుంచి ఏకంగా నెలరోజుల పాటు సెలవుపై వెళ్తుండటం అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్లు, పాలకవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కమిషనర్ సెలవు విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్లు బుధవారం నాడు పెండింగ్ ఫైళ్లపై సంతకాలు చేయాలంటూ పెద్ద సంఖ్యలో ఆమె గది వద్ద వేచి ఉన్నారు. ఇక కమిషనర్ సెలవుతో మరోసారి కార్పొరేషన్ ఇన్‌ఛార్జి బాధ్యతలు అదనపు కమిషనర్ రమణ రెడ్డికి అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

'మెప్మా' అవినీతిపై కలెక్టర్ ఆగ్రహం

నివేదిక పంపాలని కార్పొరేషన్‌కు ఆదేశం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ప్రజాశక్తి వార్తకు స్పందన

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మెప్మా పరిధిలో జరిగిన అవినీతిపై కలెక్టర్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అనంతపురం కార్పొరేషన్‌లో 'మెప్మాలో అవినీతి కంపు' అన్న శీర్షికన ప్రజాశక్తిలో ఈ నెల 12వ తేదీన కథనం ప్రచురితం అయ్యింది. దీనిపై కలెక్టర్ గౌతమి స్పందించారు. తక్షణం విచారణ చేపట్టి నివేదిక పంపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. దీంతో కార్పొరేషన్ మెప్మాలో కదలిక మొదలైంది. సిటీ మిషన్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, మెప్మా టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ విశ్వజ్యోతి, కమ్యూనిటీ ఆర్గనైజర్లు శిరీషా, వైజయంతి తదితరుల్లో చలనం వచ్చింది. అంకాలమ్మ, సుబ్రహ్మణ్యేశ్వర, ఆశ తదితర డ్వాక్రా సంఘాల గ్రూప్ లీడర్లను అధికారులు పిలిపించుకుని స్వాహా చేసిన సొమ్మును వెనక్కు కట్టించేలా వారితో గత రెండు రోజులుగా చర్చలు జరుపుతున్నారు. ఆశ ఐక్య సంఘంలో స్వాహా చేసిన ఆరు లక్షల రూపాయలు తక్షణం వెనక్కు చెల్లించేందుకు స్వాహా చేసిన వారు ఒప్పుకోనట్లు తెలుస్తోంది. ఎలాగైనా ఈ సొమ్మును రికవరీ చేసి ఈ సమస్యలో నుంచి బయట పడాలని అధికారులు భావిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి స్వాహా చేసిన మొత్తాల్లో రికవరీ అంశంపూ ఒక నివేదిక తయారు చేసుకున్నారు. ఈ స్వాహా పర్వంపై ఇప్పుడు గ్రూపు లీడర్లు ఒక్కొక్కరుగా గళం విప్పుతున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై ఫిర్యాదులు చేసేందుకు సిద్ధం అవుతుండడంతో కొందరు అధికారులు దడ మొదలైంది. కమ్యూనిటీ ఆర్గనైజర్లతో కుమ్మక్కైన రీసోర్స్ పర్సన్స్ కూడా తమ ఉద్యోగాలు ఎక్కడ ఊడుతాయోనని ఆందోళనలో పడ్డారు. కేంద్ర పథకాల నుంచి గ్రూపులకు ప్రోత్సాహకాలుగా వచ్చే నగదును కమ్యూనిటీ ఆర్గనైజర్లు మెప్మా విభాగంలోని అధికారులతో కలిసి పంచుకు తింటున్నట్లు కూడా సంఘం సభ్యులు ఆరోపిస్తున్నారు. అనంత కార్పొరేషన్ మెప్మాలో జరుగుతున్న అవినీతిపై లోతైన దర్యాప్తు చేస్తే మరిన్ని వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంటుందని పలువురు డ్వాక్రా సంఘం లీడర్లు చెబుతున్నారు.

15న ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ సమావేశం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఉపాధ్యాయభవన్‌లో జిల్లా కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బిసిఆర్.దాస్ బుధవారం తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు ఎఈఎఫ్, ఎంఎస్ఎఫ్, ఎంఎంఎస్, విహెచ్‌పిఎస్, ఎంకెఎం, ఎంజెఎఫ్, ఎంఎల్ఎఫ్ సంఘాలతో జిల్లా నూతన కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 15న నిర్వహించే సమావేశానికి ఎమ్మార్పీఎస్ నేతలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వేగవంతంగా ఈ క్రాప్ నమోదు

ఎడిఎ పద్మజ

ప్రజాశక్తి-ఉరవకొండ

రబీ సీజన్‌కు సంబంధించి ఈ క్రాఫ్ నమోదును వేగవంతం చేయాలని ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ ఆదేశించారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రం సిబ్బంది చేపట్టిన పంట నమోదును బుధవారం ఆమె పరిశీలించారు. రేణుమాకులపల్లి గ్రామంలో పంట నమోదు ప్రక్రియను సందర్శించి క్షేత్రస్థాయిలో ఇబ్బందులను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. బెట్ట పరిస్థితులలో పప్పుశెనగ పంటకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు వివరించారు. ఎఒ శుభకర్ బూదగవి గ్రామ పరిధిలో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బంది, రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో రేణుమాకులపల్లి, బూదగవి గ్రామాల ఆర్‌బికె సిబ్బంది అక్షిత, షఫీ, రైతులు పాల్గొన్నారు.



ఆత్మకూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునితో మాట్లాడుతున్న పోలీసులు

పాఠశాలను సందర్శించిన పోలీసులు

ప్రజాశక్తి-ఆత్మకూరు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాలలో 'విద్యార్థినులపై ఆకతాయిల వేధింపులు' అన్న శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం వెలువడిన కథనంపై పోలీసులు స్పందించారు. బుధవారం ఉదయం ఏఎస్ఐ దస్తగిరి, పోలీసు సిబ్బంది పాఠశాలను సందర్శించారు. అక్కడి విద్యార్థినులతో మాట్లాడారు. ఆకతాయిల నుంచి ఏవైనా సమస్యలు ఎదురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎప్పుడైనా 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇస్తే వెంటనే స్పందిస్తామన్నారు. అనంతరం వారు పాఠశాల ఆవరణాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు భద్రతగా తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఏ చిన్న సమస్య ఉన్నా పోలీసులకు తెలియజేయాలన్నారు. కాగా ప్రజాశక్తి కథనంపై ఇంటలిజెన్స్ సిబ్బంది కూడా స్పందించి వివరాలను తీసుకున్నారు.

మట్కాపై నిరంతర నిఘా : ఎస్పీ

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

జిల్లాలో మట్కాపై నిరంతర పోలీసు నిఘా ఉంటుందని, దీనిని నిర్వహించినా, ఆడినా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ హెచ్చరించారు. జిల్లాలో మట్కా నియంత్రణలో భాగంగా దానితో సంబంధాలు ఇదివరకే కొనసాగించిన వారిని ఆయా పోలీసు స్టేషన్లకు పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ చేపట్టి, దానికి దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. జిల్లాలో ఎక్కడైనా మట్కా నిర్వహిస్తుంటే తన ఫోన్ నంబర్ 9440796800కు సమాచారం అందించాలని ఎస్పీ తెలియజేశారు. సమాచారం పంపిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఏపీ ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ 27/2023ను వెంటనే రద్దు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సతీష్ డిమాండ్ చేశారు. బుధవారం ఐలు ఆధ్వర్యంలో జిల్లా కోర్టు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యూ ల్యాండ్ టైటిల్ 27/2023తో ప్రజలకు ఎలాంటి లాభం లేదన్నారు. కావున తక్షణం దీనిని ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పని చేసే ల్యాండ్ టైటిలింగ్ అధికారులపై రాజకీయ జోక్యం ఉండే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చెబుతున్నట్లు సులభంగా వేగంగా కేసులు పరిష్కారం చేయాలని భావిస్తే కోర్టులను పెంచి, సిబ్బందిని నియమించాలన్నారు. అవసరమైన చోట్ల ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయడం ద్వారా కేసులు త్వరితగతిన పరిష్కారం అవుతాయని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే టైటిలింగ్ యాక్ట్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐలు జిల్లా సహాయ కార్యదర్శి జి.ప్రకాష్, నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు హరి, అశోక్, చంద్రశేకర్, సుదర్శన్‌రెడ్డి, భాస్కర్, బాలాజీ నాయక్, అపర్ణాదేవి, షెక్షావలి, సాయి భరత్, గంగాధర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె ఆగదు

ఎన్నికల ముందు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు సమ్మెను విరమించేది లేదని సిఐటియు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 2వ రోజుకు కొనసాగింది. జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో అంగన్‌వాడీలు నిరసన దీక్షలు చేపట్టారు. వీరికి సిపిఎం, టిడిపి, జనసేన పార్టీలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. సమ్మెలో భాగంగా చంటిబిడ్డలు, కుటుంబ సభ్యులతో కలిసి అంగన్‌వాడీలు దీక్షల్లో పాల్గొన్నారు. తమ న్యాయమైన సమస్యలను ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిష్కరించాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు.

ప్రభుత్వంపై అంగన్‌వాడీల ఆగ్రహం
జిల్లా వ్యాప్తంగా 2వ రోజు కొనసాగిన సమ్మె
పలు పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తెలంగాణ కంటే ఎక్కువ వేతనాలు ఇస్తామని పాదయాత్ర సందర్భంగా అంగన్‌వాడీలకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సిపిఎం, టిడిపి, జనసేన, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్‌వాడీల సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి జమున అధ్యక్షత నిర్వహించిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాలరంగయ్య, జిల్లా నాయకులు ఆర్‌వి.నాయుడు, సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్, జిల్లా ఉపాధ్యక్షులు పత్తి చంద్రశేఖర్, జయరామిరెడ్డి, రాయలసీమ రీజనల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు లక్ష్మి నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం నాగభూషణం, సిఐటియు జిల్లా కోశాధికారి గోపాల్ హాజరై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి పదే పదే విజ్ఞాపన పత్రాలు అందజేశామన్నారు. చలో విజయవాడ కార్యక్రమాన్ని కూడా నిర్వహించి ప్రభుత్వానికి నిరసన తెలిపామన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా ఏ ఒక్క సమస్య పరిష్కరించలేదన్నారు. గ్రాట్యుటీ, అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, సెంటర్ అద్దెలు చెల్లించాలని అడుగుతుంటే ఉన్నామని తెలిపారు. అంగన్‌వాడీలు అప్పులు చేసి సెంటర్ అద్దెలు చెల్లిస్తున్నామన్నారు. నెల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. గత్యంతరం లేకనే నిరవధిక సమ్మె చేపట్టాల్సిన దుస్థితిని ప్రభుత్వం కల్పించిందన్నారు. సమ్మె చేస్తే ఉద్యోగాల్లో నుంచి తొలగిస్తామని పద్ధతుల్లో అధికారులు బెదిరించడం అన్యాయంగా ఉందన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మె విరమించేది లేదని తేల్చి చెప్పారు. సిపిఎం జిల్లా నాయకులు ఆర్‌వి.నాయుడు మాట్లాడుతూ మహిళా పక్షపాతి ప్రభుత్వమని చెప్పుకునే ముఖ్యమంత్రికి అంగన్‌వాడీలు రోడ్డు ఎక్కి నిరసన చేస్తుంటే కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటీ ఇవ్వాలన్నారు. 6 నెలలుగా బకాయి పడ్డ సెంటర్ అద్దెలు, టిఏ, డిఏలు బిల్లులు తక్షణం చెల్లించాలన్నారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇస్తున్న వేతనాలు కంటే రాష్ట్రంలో అంగన్‌వాడీలకు పెంపుదల చేస్తామన్న ముఖ్యమంత్రి హామీని అమలు చేయాలన్నారు. టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం నాగభూషణం మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. యువగళం పాదయాత్ర ముగింపు రోజున నారా లోకేష్ అంగన్‌వాడీలకు సమస్యలపై స్పష్టమైన హామీ ఇవ్వబోతున్నారని తెలిపారు. ఉద్యోగాలు తొలగిస్తామని బెదిరిస్తే భయపడొద్దని టిడిపి ప్రభుత్వంలో తప్పకుండా అంగన్‌వాడీలకు న్యాయం జరుగుతుందన్నారు. సమ్మెకు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మినరసమ్మ, తిరుమలేష్, జనసేన పార్టీ నగర అధ్యక్షులు బాబురావు, జిల్లా ఉపాధ్యక్షులు పత్తి చంద్రశేఖర్, ఈశ్వరయ్య, నాగేంద్ర, టిఎన్‌టియుసి వంకదారి వెంకటక్రిష్ణ, పూల బాషా తదితరులు మద్దతుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎన్టీఆర్ శ్రీనివాసులు, ఆది, పోతులయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు అరుణ, విజయభారతి, నక్షత్ర, రుక్మిణి, ఐఎఫ్‌టియు నాయకులు ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో దీక్షలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు

పుట్లూరు : ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజూ కొనసాగింది. వీరి దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్ బలోపేతం, అంగన్వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శిబిరంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు జయలలిత, రమాదేవి, అనంతలక్ష్మి, శశికళ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సూరి, నారాయణ, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటచౌదరి, నాయకులు టి.పెద్దయ్య, నాగభూషణ, భాస్కర్‌రెడ్డి, నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : సమస్యల పరిష్కారం కోసం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ సిబ్బంది చేపట్టిన దీక్షకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు, మండల కార్యదర్శి కుళ్లాయప్ప సంఘీభావం తెలిపారు శిబిరంలో అంగన్వాడీ కార్యకర్తలతో పాటు వారి పిల్లలు సైతం కూర్చున్నారు. సిఐటియు నాయకులు, అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ ఇకనైనా ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరారు. దీక్షలో మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి స్పందించాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్

రాయదుర్గం : న్యాయమైన సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మెపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని వారి సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మె బుధవారం 2వ రోజుకు చేరుకుంది. రాయదుర్గం జరుగుతున్న సమ్మెలో రాంభూపాల్ పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలోకి వెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వమే కారణం అన్నారు. ఎన్నికల ముందు అంగన్వాడీ వర్కర్లకు ఇచ్చిన హామీలను నాలుగున్నరేళ్లు గడిచినా అమలు చేయకుండా ముఖ్యమంత్రి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. హామీలను తుంగలోకి తొక్కడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో అంగన్‌వాడీలు రోడ్లపైకి వచ్చిన ఆందోళనలు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. సమస్యల పరిష్కారం చేయాలంటూ సమ్మె చేస్తుంటే మరోవైపు ప్రభుత్వం అధికారులతో బెదిరింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. బెదిరింపులతో ఉద్యమాలను ఆపాలనుకోవడం అవివేకం అన్నారు. ప్రభుత్వ పెద్దలు, అధికారులు బెదిరింపు చర్యలను మానుకుని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. లేనిపక్షంలో అంగన్వాడీ వర్కర్లు చేస్తున్న సమ్మెను సిఐటియు, అనుబంధ రంగాల కార్మికులతో కలుపుకుని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి.మల్లికార్జున, సిపిఎం నాయకులు మధు, అంజి, ఆంజనేయులు, నాగరాజు, రమేష్, శంకర్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాధమ్మ, ఉలిగమ్మ, రుద్రమ్మతో పాటు రాయదుర్గం మండల అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

సమ్మెను అణచివేయాలని చూస్తే భారీ మూల్యం తప్పదు

కళ్యాణదుర్గం : అంగన్వాడీలు చేస్తున్న సమ్మెను ప్రభుత్వం అణచివేయాలని చూస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ హెచ్చరించారు. సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలో అంగన్వాడీలు చేస్తున్న నిరవధిక సమ్మెకు రాంభూపాల్ సిఐటియు నాయకుడు అచ్యుత్‌ప్రసాద్‌తో కలిసి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పాతక్క, పద్మక్క, తులసి, విద్యార్థి సంఘం నాయకులు వంశీ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : సిఎం జగన్ అంగన్వాడీల సమస్యలపై అధికారులతో చర్చించి పరిష్కరించాలని, లేనిచో ఉద్యమం ఉధృతం చేస్తామని సిఐటియు, రైతు సంఘం నాయకులు హెచ్చరించారు. సమ్మెలో భాగంగా రెండో రోజూ యల్లనూరులో అంగనవాడీ వర్కర్లు నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, వ్య.కా.సం జిల్లా అధ్యక్షుడు సూరి, రైతు సంఘం నాయకులు రాజారామిరెడ్డి, రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. సిఐటియు మండల కార్యదర్శి వి.నిర్మల, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కళ్యాణి, శోభ మాట్లాడుతూ ప్రభుత్వాలు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో దశల వారీగా పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు పార్వతి, బావమ్మ, గంగాదేవి, పాల్గొన్నారు.

గుంతకల్లు రూరల్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు అంగన్వాడీలు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. సిఐటియు, సిపిఎం, టిడిపి నాయకులు వారి సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు కసాపురం రమేష్, నాయకులు సాకే రమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుమ్మఘట్ట : అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి మేరీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుమ్మఘట్టలో అంగన్వాడీలు చేపట్టిన దీక్షా శిబిరాన్ని మేరీ సందర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు రాధిక మెహ్రూన్, , రుద్రమ్మ, చంద్రకళ, మల్లక్క మరియు గుమ్మగట్ట మండల అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లు పాల్గొన్నారు.

శింగనమల : అంగన్వాడీ సిబ్బంది సమస్యలు పరిష్కరించేంత వరకూ సమ్మె కొనసాగుతోందని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు తరిమెల రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, సెక్టార్ లీడర్ రమణమ్మ, మండల అధ్యక్షురాలు భారతి స్పష్టం చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు చేపట్టిన శిబిరంలో అంగన్వాడీలు దీక్ష చేపట్టారు. శిబిరంలో ప్రమీల, రత్నమ్మ, రాజేశ్వరి, రమశ్రీ, రాధికా, సుగుణ, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన ధర్నా రెండో రోజుకు చేరుకుంది. స్థానిక తహశీల్దార్ కార్యాల యం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో మండలంలోని అంగన్వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు, ఆయాలు దీక్ష చేపట్టారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు హెచ్చరించారు.

పెద్దవడుగూరు : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె రెండో రోజుకి చేరింది. కార్యకర్తల సంఘం నాయకురాలు నాగరాణి, భాగ్యలక్ష్మి, తదితరులు దీక్షల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉరవకొండ : అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించి న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని వామపక్ష, టిడిపి, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. విడపనకల్లు, వజ్రకరూరు మండల కేంద్రాల్లో అంగన్వాడీలు చేపట్టిన సమ్మె కొనసాగింది. వీరి దీక్షలకు సిపిఎం మండల కన్వీనర్ విరుపాక్షి, జిల్లా కార్యవర్గ సభ్యులు రంగారెడ్డి, జ్ఞానమూర్తి, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, చెన్నరాయుడు, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కేంగూరి ఎర్రిస్వామి, యానిమేటర్ల సంఘం నాయకులు ప్యాపిలి ఎర్రిస్వామి, వీరన్న, శంకరయ్య సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమం లో సిపిఐ నాయకులు సుల్తాన్, తలారి మల్లికార్జున, యూనియన్ నాయకులు స్వర్ణలత గాయత్రీదేవి, శశికళ, లక్ష్మీదేవి, రామాంజినమ్మ, శ్రీలక్ష్మి, శ్వేతనాగు, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. వీరి సమ్మెకు టిడిపి నాయకులు మద్దతు పలికారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ జయంతి, రామాంజనమ్మ, టిడిపి నాయకులు రాజేష్‌నాయక్, వడ్డే ఆనంద్, మల్లేశ్వర్‌రెడ్డి, బాలరాజు, మారుతి, మురళి, ఓబులేసు పాల్గొన్నారు,

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలపై నివేదిక ఇవ్వండి

ప్రజాశక్తి-రాయదుర్గం

సెక్టార్ అధికారులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటర్లు, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి కనీస సౌకర్యాలపై నివేదిక ఇవ్వాలని రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారిణి కరుణకుమారి ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రంలో లైట్లు, ఫ్యాన్లు, ఫర్నిచర్, గాలి, వెలుతురు, ఇంటర్నెట్, ర్యాంపు, ప్రహరీ, తదితర సౌకర్యాలపై నివేదిక అందజేయాలన్నారు. ఓటర్లు స్థానికులా, పోలింగ్ కేంద్రానికి ఎంత దూరంలో ఉన్నారు, మార్గమధ్యలో వాగు, వంకలు లాంటి అడ్డంకులు ఏమైనా ఉన్నాయా, తదితర సమాచారం సేకరించాలన్నారు. ఓటర్లు ఫిర్యాదు చేసినా, ఓటరు జాబితాపై రాజకీయ పార్టీలకు సందేహా లు, అభ్యంతరాలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ సుజాత, వివిధ మండలాల సెక్టార్ అధికారులు, సహాయ ఎలక్ట్రోరల్ రిజిస్టింగ్ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆఫీసర్ కరుణకుమారి

ఓటరు జాబితా పారదర్శకంగా ఉండేలా చూడండి : కాలవ

ఓటర్ల జాబితాలో సవరణలు పారదర్శకంగా, జవాబుదారీగా ఉండేలా చూడాలని, అర్హులైన ప్రతి ఓటరు పేరూ జాబితాలో ఉండేలా చూడాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ఇఆర్‌ఒ కరుణ కుమా రికి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం కాలవ మీడియాతో మాట్లాడుతూ నియోజకవర్గంలో 17వేల మంది ఓటర్లు బదిలీపై వచ్చినట్లు అధికారులు చెబుతున్నారే కానీ వారి పూర్తి వివరాలు రాజకీయ పార్టీలకు ఇవ్వలేద న్నారు. ప్రజాభిమానం కోల్పోయిన వైసిపి దొంగ ఓట్లు చేరిక, టిడిపి సానుభూతిపరుల ఓట్ల తొలగింపు పై దృష్టి పెట్టిందని ఆరోపించారు. ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బళ్లారి నుంచి ఓటర్లను రాయదుర్గానికి బదిలీ చేయించే ప్రమాదం ఉందన్నారు.

సంక్రాంతికి వెహికల్ అండర్ పాస్ సిద్ధం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి -అనంతపురం

నగరంలోని టవర్ క్లాక్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద వెహికల్ అండర్ పాస్ పనులు రానున్న సంక్రాంతి నాటికి పూర్తవుతాయని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆర్‌ఒబి వద్ద జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించి కాంట్రాక్ట్ ప్రతినిధులు, రైల్వే, ఎన్‌హెచ్ అధికారులతో మాట్లాడి పనుల పురోగతిప ఆరా తీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రహదారి పనులు చేపట్టామని, ఇవి పూర్తి కావచ్చాయన్నారు. ఇప్పటికే బ్రిడ్జిని అందుబాటులోకి తెచ్చామని, అండర్ పాస్ పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయ న్నారు. సంక్రాంతి పండుగ నాటికి అండర్ పాస్ పూర్తవుతుందన్నారు. భూ సేకరణకు సంబంధించి నిధులు మంజూరయ్యాయని, భూమి కోల్పోయే వారి ఖాతాల్లో త్వరలోనే నిధులు జమ చేసి బ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్డుతో పాటు ఇతర ప్రాంతాల్లో పనులు కూడా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే వెంట మేయర్ మహమ్మద్ వసీం, వైసిపి నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, గౌస్‌బేగ్, కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ సైపుల్లా బేగ్ ఉన్నారు.



అండర్ పాస్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత



ప్రణయ్‌రెడ్డి



రాజేష్

వైసిపి యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ : వైసిపి రాయలసీమ(అనంతపురం, సత్యసాయి, కడప జిల్లాలు) యువజన విభాగం జోనల్ ఇన్‌ఛార్జిగా యువనేత వై.ప్రణయ్‌రెడ్డిని మరోసారి నియమించారు. ఆయనతో పాటు ఆమిద్యాల గ్రామానికి చెందిన బిరిదేపల్లి రాజేష్‌ను కమిటీ జాయింట్ సెక్రటరీగా నియమించారు. ప్రణయ్‌రెడ్డి, రాజేష్ మాట్లాడుతూ తమపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని నిలబెడతామని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

నార్పల : మండల పరిధిలోని సిద్ధిరాచర్ల గ్రామపంచాయతీ దుర్గం గ్రామం మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం సర్పంచి రామాంజనేయులు తన సోదరి వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. సర్పంచి మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో పచ్చదనం పెంపొందించేందుకు మొక్కల కుండీలను అందజేశానని తెలిపారు. ప్రతి విద్యార్థి ఇంటి దగ్గర నాటేందుకు మొక్కలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగార్జునరెడ్డి, రమేష్‌రెడ్డి, శివారెడ్డి, పాల్గొన్నారు.

వేరుశనగ పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-శింగనమల

వేరుశనగ పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం ఇచ్చి ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో సిపిఎం ఆధ్వర్యంలో డిఆర్‌ఒకి వినతిపత్రం అందజేశారు. సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ. 50 వేల పరిహారం, ఏడాదిలో 200 రోజుల పాటు ఉపాధి పనులు, రోజుకు రూ. 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాచేపల్లి గ్రామం వద్ద లీడ్ క్యాప్ చెప్పుల తోళ్ల పరిశ్రమను ఓపెన్ చేసి ఉద్యోగావకాశాలు కల్పించాలని, సలకం చెరువు గ్రామంలో ఎస్సీ కుటుంబాలకు 3 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి ఇవ్వాలని, తరిమెల, శింగనమల ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటలూ డాక్టర్స్, స్టాఫ్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. మండల వ్యాప్తంగా భూ సర్వేను వెంటనే రద్దు చేయాలని, తదితర సమస్యలపై సిపిఐ జిల్లా సమితి సభ్యులు తరిమెల రామాంజనేయులు జగనన్నకు చెబుదాంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జయరాముడు, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, పుల్లన్న, మునీంద్ర, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు టీచింగ్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

అధ్యక్ష, కార్యదర్శులుగా నారాయణరెడ్డి, శారద

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల టీచింగ్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ఆచార్య అరుణక్రాంతి, ప్రిన్సిపల్ ఎస్‌వి.సత్యనారాయణ బుధవారం తెలిపారు. అధ్యక్షులుగా డాక్టర్ టి.నారాయణరెడ్డి, కార్యదర్శిగా లెఫ్టినెంట్ శారద, ఉపాధ్యక్షులుగా ఆచార్య విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా డాక్టర్ ఎపి.శివకుమార్, ట్రెజరర్‌గా విష్ణువర్ధన్ ఎంపికయ్యారు. నూతన కార్యవర్గాన్ని విసి ఆచార్య రంగజనార్ధన రిజిస్ట్రార్ ఆచార్య సి.శశిధర్ అభినందించారు. నూతన అధ్యక్షకార్యదర్శులు మాట్లాడుతూ సభ్యుల సమస్యల పరిష్కారానికి, వర్సిటీ అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.



ఎన్నికైన అసోషియేషన్ సభ్యులు విసి రంగజనార్ధన

జూనియర్ లైన్‌మెన్ విద్యుదాఘాతంతో మృతి

పెద్దపప్పూరు : మండల పరిధిలోని చిన్నపప్పూరు గ్రామానికి చెందిన బి.చెన్నారెడ్డి కుమారుడు బిండెల నరేష్‌రెడ్డి(29) చీమల వాగుపల్లి సచివాలయంలో జూనియర్ లైన్‌మెన్‌గా విధులు నిర్వర్తించేవాడు. సచివాలయం పరిధిలోని కుమ్మెత గ్రామంలో బుధవారం ఉదయం 11 కె.వి విద్యుత్ లైన్ మరమ్మత్తులు చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. అతడికి భార్య గాయత్రి, మూడేళ్ల కూతురు, ఏడాది బాబు ఉన్నారు. జూటూరు సబ్‌స్టేషన్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే నరేష్‌రెడ్డి మృతి చెందాడని భార్య కన్నీరుమున్నీరుగా విలపించింది.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యం : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగరపాలక సంస్థలో నలుగురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అనారోగ్య కారణాలతో విధులు నిర్వర్తించలేని పరిస్థితి ఏర్పడగా బుధవారం మేయర్ డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మిలతో కలిసి వారి కుటుంబ సభ్యులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. మేయర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహకారంతో మృతిచెందిన కార్మికులు, ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఎప్పటికప్పుడు కారుణ్య నియామకాలు చేపడుతున్నామ న్నారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణ కోసం ప్రత్యేకంగా మెడికల్ క్యాంపులు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సైఫుల్లా, చంద్రకళ, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సోని రమణ, కో ఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌ఒ సంగం శ్రీనివాసులు, వైసిపి నాయకులు రవి, కుళ్లాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందజేస్తున్న మేయర్ వసీం

నగరంలో పచ్చదనం పేరిట దోపిడీ

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అనంతపురం నగరంలో చేసిన అభివృద్ధి శూన్యమని జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్ దుయ్యబట్టారు. వరుణ్ బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి నగరంలోని ఎన్టీఆర్ మార్గ్‌లో పర్యటించి పచ్చదనం పేరిట జరిగిన అవినీతిని బట్టబయలు చేశారు. ఒక్కో మొక్క రూ. 10వేల ప్రకారం కొనుగోలు చేశామని చెప్పిన వైసిపి నేతలు ఈ విషయమై జనసేన ప్రశ్నించగా రూ. 3,500 చొప్పున కొనుగోలు చేశామని మాట మార్చారన్నారు. కనీసం ఆ మొక్కకు ట్రీ గార్డ్ లేదు, నీళ్లు పోసిన పాపాన పోలేదని మండిపడ్డారు. ఫలితంగా వేలాది రూపాయలు ఖర్చు చేసి నాటిన మొక్కలు ఎండిపోయాయ న్నారు. నగర అభివృద్ధిపై తక్షణమే ఎమ్మెల్యేతో పాటు మేయర్ వసీం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి అవినీతి అక్రమాలపై జనసేన రాజీలేని పోరాటాలు చేస్తుందని, రానున్న ఎన్నికల్లో జనసేన జెండా ఎగురవేస్తామని వరుణ్ స్పష్టం చేశారు. ఆయనతో పాటు నగర అధ్యక్షులు పొదిలి బాబురావు, పెండ్యాల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షులు జయరాంరెడ్డి, అంకె ఈశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శులు పత్తి చంద్రశేఖర్, కుమ్మర నాగేంద్ర, జిల్లా కార్యదర్శులు కిరణ్‌కుమార్, అవుకు విజయకుమార్, ముప్పూరు కృష్ణ, నగర ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఎండిన మొక్కలను పరిశీలిస్తున్న టిసి వరుణ్

15న రైతుల మహా ప్రదర్శన బహిరంగ సభ

పామిడి :కర్నూలు నగరంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జరిగే ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాలను జయ ప్రదం చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక రైతు సంఘం కార్యాలయంలో సమావేశాల గోడపత్రికలను విడుదల చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ రైతుల మహా ప్రదర్శన బహిరంగ సభ నిర్వహిస్తామ ని, ఆ సభకు ఎఐకెఎస్ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యక్షులు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారన్నారు. రైతుల అన్ని రకాల రుణమాఫీ, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు, తదితర అంశాలపై తీర్మానాలు చేస్తారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు అనిమిరెడ్డి, మండల కార్యదర్శి మల్లేష్, నాయకులు ముత్యాలు, ఎర్రిస్వామి, గిర్రప్ప, శంకర్, బాబాఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.




పోస్టర్లు విడుదల చేస్తున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వం : మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుత్తి

ప్రజల సమస్యలను వైసిపి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే ఆర్.జితేంద్రగౌడ్ విమర్శించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన 17, 18 వార్డుల్లో పార్టీ ఇన్‌ఛార్జులు ఎస్‌ఎం.బాషా, ఎన్.కేశవనాయుడు ఆధ్వర్యం లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వైసిపి నాయకులు చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలతో పాటు టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల, పట్టణ కన్వీనర్లు బర్దివలి, రవిగౌడ్, ఎంపిటిసి జింకల నారాయణస్వామి, సర్పంచి పి.భరత్‌కుమార్, టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్, డైరెక్టర్ కృష్ణ, నాయకులు శ్రీకాంత్‌చౌదరి, మోడే శ్రీనివాస్‌యాదవ్, వీరేష్, నాయకులు ఎంకె.చౌదరి, గోవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌చౌదరి, నరసింహులు, వెంకటరాముడు, జి. సుంకన్న, వైకుంఠ, అగ్గిరాముడు, కొత్తపేట సూరి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



టిడిపి కరపత్రాలు పంపిణీ చేస్తున్న జితేంద్రగౌడ్

పుట్లూరు పోలీస్ స్టేషన్ సందర్శన

పుట్లూరు : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను బుధవారం అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకట శివారెడ్డి సందర్శించి రికార్డులను పరిశీలించారు. మండలంలో నేరాలపై సిఐ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ దిలీప్‌కుమార్‌ని అడిగి తెలుసుకున్నారు. తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలు గొడవలకు దూరంగా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. అసాంఘిక కార్యకలా పాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు.

కార్మికుల సమస్యలు పట్టవా? : టిఎన్‌టియుసి

ప్రజాశక్తి-అనంతపురం

కరువు జిల్లాలో కార్మికుల సమస్యలు ప్రభుత్వానికి, కార్మిక శాఖకు పట్టవా అని టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు పోతుల లక్ష్మీనరసింహులు డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను ప్రశ్నించారు. కార్మికులు సమస్యలపై బుధవారం టిఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుజ్జల నాగభూషణం, సత్యసాయి జిల్లా అధ్యక్షులు తాడాల నాగభూషణం ఆధ్వర్యంలో నగరంలోని కార్మిక శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో వినతపత్రం అందజేశారు. పోతుల లక్ష్మీనరసింహులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు తరహాలో టైలర్లు, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్య కార్మికులకు 6 నెలలకోసారి హెల్త్ చెకప్, ఇపిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో టిఎన్‌టియుసి నగర అధ్యక్షుడు పూల బాషా, టైలర్ యూనియన్ అధ్యక్షుడు ముత్యాలు, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు మంజుల నారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, బాబయ్య, సత్యనారాయణ, రంగనాథ్, వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకదారు వెంకటకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.


కార్మిక శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొనసాగిన జిడిఎస్ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలోని తపాలా కార్యాలయం వద్ద రెండో రోజైన బుధవారం కూడా గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగుల సమ్మె కొనసాగింది. దీంతో తపాలా కార్యాలయాల్లో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తపాలా కార్యకలాపాలు, లావాదేవీల కొనసాగింపునకు అంతరాయం కలిగింది. సమ్మెలో రాయదుర్గం తపాలా సబ్ డివిజన్ పరిధిలోని జిడిఎస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

పామిడి : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తపాలా ఉద్యోగులు స్థానిక తపాలా కార్యాలయం నిరవధిక సమ్మె చేపట్టారు. ఏపి అసిస్టెంట్ సర్కిల్ సెక్రటరీ పి.నాగేంద్రబాబు మాట్లాడుతూ గ్రామీణ తపాలా ఉద్యోగులకు 8 గంటల పని, పెన్షన్ ప్రయోజనాలు, అదనపు ఇంక్రిమెంట్లు, గ్రాట్యుటీ పెంపు, తదితర డిమాండ్లను పరిష్కరించడంతో పాటు వేతంపులు ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగులు, నాయకులు రాజు, కుల్లాయప్ప, ఆనంద్, వెంకట్రామిరెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


రాయదుర్గంలో సమ్మెలో పాల్గొన్న జిడిఎస్ ఉద్యోగులు

ఆర్టీసీ కార్మికుల గేట్ ధర్నా

ప్రజాశక్తి-అనంతపురం


ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ధర్నాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం అనంతపురం డిపో కార్యదర్శి రామాంజనేయులు ఆధ్వర్యంలో నగరంలోని డిపో గ్యారేజీ గేట్ ముందు ధర్నా చేపట్టారు. ముఖ్యఅతిథులుగా జిల్లా ఛైర్మన్ సూరిబాబు, జిల్లా అధ్యక్షులు ముద్దుపాటి లక్ష్మీనారాయణ, హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీవాణి, మద్దిలేటి, సదాశివరెడ్డి, హరినాథరెడ్డి, బాలకృష్ణ, సీనియర్ నాయకులు వెంకటేష్, నాగిరెడ్డి, డిపో ట్రాఫిక్ అండ్ గ్యారేజీ ఉద్యోగులు పాల్గొన్నారు.


రాయదుర్గంలో గేట్ ధర్నా చేపట్టిన ఆర్టీసీ కార్మికులు

రాయదుర్గం : నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపో వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా రెండవ రోజైన బుధవారం కూడా కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై గేట్ ధర్నా చేపట్టారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ వెంటనే మేనేజింగ్ డైరెక్టర్ కార్మికుల సమస్యలపై చర్చలు జరిపి వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిచో మలిదశ ఉద్యమానికి కార్మికులు సిద్ధంగా ఉండాలని ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజు, డిపో అధ్యక్ష, కార్యదర్శులు తిప్పేస్వామి, జిలాన్, గ్యారేజ్ అధ్యక్ష, కార్యదర్శులు దూద్‌పీరా, సతీష్‌కుమార్, సిసిఎస్ డెలిగేట్ నాగరాజు, నాయకులు నాయక్, ఎర్రిస్వామి, మాలిక్‌బాషా, బాలాజీనాయక్, తిమ్మరాజు, చిన్న మల్లప్ప, ప్రసాద్, చంద్రశేఖర్, సత్తార్‌ఖాన్, వన్నూరుస్వామి, ప్రకాష్, రామాంజనేయులు, ఓబులేసు, సూరిబాబు, రమణయ్య, వన్నూరుస్వామి, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీ సాయి కాలేజీలో ఫ్రెషర్స్ డే

గుత్తి : పట్టణంలోని శ్రీసాయి డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం ఆమెను కళాశాల క్యాంపస్ సిఇఒ ఎ.శ్రీరాములు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.వెంకటేశ్వర్లురెడ్డి, పిఆర్‌ఆర్ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసన్నకుమార్ సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం


రాష్ట్రస్థాయి జూనియర్ త్రోబాల్ పోటీలకు ఎంపికైన 'శ్రీచైతన్య' బాలికలు

రాష్ట్రస్థాయి జూనియర్ త్రోబాల్ పోటీలకు 'శ్రీచైతన్య' బాలికలు

అనంతపురం : నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు స్పందన, శరణ్య, టి.కుందన, కె.జోషిని, టి.భవ్య రాష్ట్ర స్థాయి జూనియర్ త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎజిఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఎజిఎం మాట్లాడుతూ వీరు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా గెలుపొందాలని ఆకాంక్షించారు. వారిని ప్రిన్సిపల్ సమీనాఖాన్, వైస్ ప్రిన్సిపల్ షమీనా, అకడమిక్ కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ సత్యనారాయణ, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి చంద్రమోహన్, పిఇటి సుగుణ, సంధ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.


ప్రజలతో మాట్లాడుతున్న హర్షవర్ధన్‌రెడ్డి

పెద్దపప్పూరులో 'వై ఏపి నీడ్స్ జగన్'

పెద్దపప్పూరు : 'వై ఏపి నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం యువ నేత, ఎమ్మెల్యే తనయుడు హర్షవర్ధన్‌రెడ్డి స్థానిక రామకోటి కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపిని నమ్మి మోసపోకుండా హామీలను అమలు చేసిన వైసిపిని మరోమారు ఎన్నుకోవాలన్నారు. ఆయన వెంట వేమనాథరెడ్డి, ఎంపిపి రామిరెడ్డి, వైస్ ఎంపిపి కళావతి, మండల కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, హాజీవలి, జనార్ధన్‌రెడ్డి, అశ్వర్థనారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి, గార్లదిన్నె సింగిల్‌విండో అధ్యక్షులు అమర్‌నాథ్‌రెడ్డి, రాంబాబు, ఓబిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆరోగ్య కేంద్రం తనిఖీ చేస్తున్న అధికారి రవిశంకర్

పట్టణ ఆరోగ్య కేంద్రం తనిఖీ

బుక్కరాయసముద్రం : స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.రవిశంకర్ సందర్శించి స్థానిక వైద్యాధికారులతో సమావేశమై రికార్డులను పరిశీలించారు. క్షేత్రస్థాయి సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పిల వివరాలు, వారు విధి నిర్వహణలో పూర్తి చేయాల్సిన లక్ష్యాల గురించి ఆరా తీశారు. అసంక్రమిత వ్యాధుల సర్వే లక్ష్యాల శాతాన్ని పరిశీలించారు. హైరిస్క్ గర్భిణులను పరిశీలించి ఆరోగ్య సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ స్వాతిలక్ష్మి, డాక్టర్ తహెరున్నీసా, సిహెచ్ఒ మోహన్‌రావు, పిహెచ్‌ఎన్ చెన్నమ్మ, సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముగిసిన అరుణాచలేశ్వరుని దర్శనం

అనంతపురం : సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని జిఆర్ గార్డెన్ నాల్గవ గేట్‌లో ఏర్పాటు చేసిన అరుణగిరి నమూనాను 3 రోజులుగా 15వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు. బుధవారం నిర్వహించిన చివరి పూజలో టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జెఎల్ మురళీధర్, అనంతపురం డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య పాల్గొన్నారని ట్రస్ట్ అధ్యక్షుడు విజయసాయికుమార్ తెలిపారు. కార్యక్రమంలో సాయి ట్రస్ట్ సభ్యులు నారాయణ, రాఘవేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు సౌత్ జోన్ బాస్కెట్ బాల్ పోటీలకు 'బాలాజీ' కళాశాల విద్యార్థి

ప్రజాశక్తి-అనంతపురం : నగరంలోని శ్రీబాలాజీ పీజీ కళాశాల(ఎంసిఎ)లో మొదటి సంవత్సరం చదువుతున్న ఎన్.మహబూబ్‌బాషా జెఎన్‌టియు అనంతపురం తరపున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ బాస్కెట్ బాల్ టోర్నీకి ఎంపికయ్యాడని కళాశాల ప్రిన్సిపల్ డా. సి. మన్మథేశ్వరరెడ్డి తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో ప్రతిభ చాటాలన్నారు. మహబూబ్ బాషాను కళాశాల వ్యవస్థాపకుడు డా. పల్లె రఘునాథ రెడ్డి, ఛైర్మన్ పల్లె కిషోర్, ఎంసిఎ విభాగాధిపతి కబీర్ బాషా, ఎంబిఎ విభాగాధిపతి సర్పరాజ్, అధ్యాపక బృందం అభినందించారు.


మహబూబ్‌బాషాను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

సిఎం జగన్‌లో ఓటమి భయం : కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

సిఎం జగన్‌ను ఓటమి భయం ఆవహించిందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఓ వీడియో ప్రకటనలో ఎద్దేవా చేశారు. మంత్రులే గెలవలేరనే అభిప్రాయానికొచ్చిన జగన్ నైతికంగా ఓటమిని ఒప్పుకున్నట్లే అన్నారు. 151 మంది వైసిపి ఎమ్మెల్యేల్లో 70మంది ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్నారని, వైసిపి సర్వేలే బట్ట బయలు చేశాయన్నారు. వైసిపి ఎమ్మెల్యేల్లో 26 మంది అతి తీవ్రమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారని మరో సర్వే తేల్చి చెప్పిందన్నారు. రాయదుర్గం వైసిపి అభ్యర్థి కాపు రామచంద్రా రెడ్డి అయితే తాను 50 వేల మెజారిటీతో గెలుస్తానని, వేరెవరైనా 45 వేల మెజారిటీతో గెలుస్తానని స్పష్టం చేశారు. రాష్ట్రానికి చంద్రబాబు పాలన అవసరమన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' క్రీడా మైదానాల పరిశీలన

నార్పల : మండల వ్యాప్తంగా సచివాలయాల పరిధిలో 'ఆడుదాం ఆంధ్ర' క్రీడలు జరిగే క్రీడా మైదానాలను బుధవారం ఎంపిడిఒ దివాకర్ పరిశీలించారు. ఈ క్రీడలను సచివాలయ పరిధిలోనే నిర్వహించాలని, మైదానాలు అనుకూలం లేని ప్రాంతాల్లో సమీప క్రీడా మైదానాల్లో నిర్వహిస్తామన్నారు. నార్పల, కేసేపల్లి, బండ్లపల్లి, పప్పూరు, గూగూడు గ్రామాల్లోని క్రీడా మైదానాలను ఎంపిక చేశామని, ఆ గ్రామాలకు సమీపంలో ఉన్న సచివాలయ పరిధిలో దరఖాస్తు చేసుకున్న క్రీడాకారులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

'బడి' బస్సు కోసం విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-రాయదుర్గం

విద్యార్థుల కోసం బడి బస్సు నడపాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేపట్టి ఆర్టీసీ అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఆంజనేయులు మాట్లాడుతూ 7 గ్రామాలకు గానూ ఒకే బస్సు ఉండడంతో 150 నుంచి 200 మంది విద్యార్థులు అందులోనే ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇకనైనా విద్యార్థులకు అనుగుణంగా బడి బస్సు ఏర్పాటు చేయాలని, లేనిచో విద్యార్థులతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు నవీన్, భార్గవ్, అభి, మాన్వేష్, యోగేంద్ర, నవనీత్, నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-ఉరవకొండ

నియోజకవర్గంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ చీఫ్ ఇంజనీర్ గాయత్రిని వైసిపి పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మీసుగ బసవరాజు కోరారు. గాయత్రీదేవి బుధవారం పెన్నహోబిలం, కౌకుంట్ల, రాకెట్లతండా గ్రామాల్లో పర్యటించగా బసవరాజు ఆమెను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఆమె వెంట ఎస్‌ఇ సుభాన్ బాషా, ఇఇ జవహర్, డిఇ అంజుమాన్ సప్రిన్, జెఇ ఫాతిమా, కాంట్రాక్టర్ మహానందరెడ్డి ఉన్నారు.


చీఫ్ ఇంజనీర్ గాయత్రికి తాగునీటి సమస్యను వివరిస్తున్న బసవరాజు